పిహెచ్‌సి భవన నిర్మాణ పనుల పరిశీలన


పనులను పరిశీలిస్తున్న వైద్యులు

ప్రజాశక్తి - కాళ్ల

మధ్యలో నిలిచిన కాళ్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నూతనభవన నిర్మాణ పనులను జిల్లా వైద్యాధికారి కార్యాలయపు జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ డాక్టర్ సిహెచ్.ధనలక్ష్మి గురువారం పరిశీలించారు. త్వరలో భవననిర్మాణ పనులు పూర్తి చేసేలా అధికారుల దృష్టికి తీసుకువెళతానన్నారు. అనంతరం తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా కాళ్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నందు వైద్యాధికారి డాక్టర్ సరాబు సునీల్ అధ్యక్షతన ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో భీమవరం జిల్లా వైద్యధికారి కార్యాలయపు జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ డాక్టర్ సిహెచ్.ధనలక్ష్మి, మండల పరిషత్ కార్యాలయపు పరిపాలనాధికారి ప్రభాకర్, డాక్టర్ డి.సునీత, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

రైతన్న దిగాలు..!

పొంగిన నక్కల డ్రయిన్

2500 ఎకరాలు నీట మునక

లబోదిబోమంటున్న రైతులు

ప్రజాశక్తి - ఆచంట

నక్కల మేజర్ డ్రెయిన్, కొటాలపర్రు, తాడేరు డ్రెయిన్ ముప్పేట దాడి చేయడంతో రైతుకు గుండెకోత మిగిల్చాయి. సిరులు కురిపిస్తుందనుకున్న సార్వా నారుమడులు, నాట్లు దెబ్బతిన్నాయని రైతులు లబోదిబోమంటున్నారు. సార్వా ప్రారంభమైన నాటి నుంచే రైతులకు కష్టాలు మొదలయ్యాయి. ఆకుముడుల సందర్భంలో ఒకసారి, ఊడ్పుల సమయంలో రెండు సార్లు నక్కల మేజర్ డ్రెయిన్ 10 రోజుల వ్యవధి లోనే ఉగ్రరూపం దాల్చి పంట పొలాలపై విరుచుకుపడింది. వారంరోజుల క్రితమే ఉప్పొంగిన డ్రెయిన్ భారీ వర్షాలకు, గోదావరి వరదలకు మరోసారి ఉగ్రరూపం దాల్చింది. ప్రస్తుతం ఈ డ్రెయిన్ పరివాహక ప్రాంతాల్లో సుమారు 2500 ఎకరాల్లో చేలు ముంపు బారిన పడ్డాయి. మరో 125 ఎకరాల్లో ఆకుమడులు నీట మునిగాయి. ప్రస్తుతం ఈ చేలన్నీ చెరువులను తలపిస్తున్నాయి.

తప్పని ముప్పు..

నక్కల మేజర్ పరివాహక ప్రాంతాల్లో గత వారం రోజుల నుంచి మళ్లీ వర్షాలు పడుతుండడంతో పెద్ద ఎత్తున మురుగునీరు డ్రెయిన్‌లోకి వచ్చి చేరుతోంది. వర్షాలకుతోడు వశిష్ట గోదావరి ఉగ్రరూపం దాల్చడంతో రైతులకు దిక్కు తోచడం లేదు. వరదలు లేకుంటే డ్రెయిన్‌లో మురుగు గోదావరిలోకి ప్రవేశించేది. వరదల నేపథ్యంలో ప్రస్తుతం సూయ్లిజ్ తలుపులు మూసుకున్నాయి. దీంతో డ్రెయిన్ ఎగదన్ని వేల ఎకరాల్లో ముంచేసింది.

మేజర్ డ్రెయిన్‌లో ఒకటి..

జిల్లాలోని మేజర్ డ్రెయిన్లలో ఒకటైన నక్కల డ్రెయిన్ డెల్టాలోని నిడదవోలు, ఆచంట, పాలకొల్లు, నియోజకవర్గంలోని కాకరపర్రు, పెనుగొండ, కొట్టాలపర్రు, శేషమ్మ చెరువు, ఆచంట, ఆచంట వేమవరం, మినిమంచిలిపాడు, వద్దిపర్రు, కాంబోట్లపాలెం, నార్నిమెరక మీదుగా ప్రవహించి లక్ష్మీపాలెం వద్ద గోదావరిలో కలుస్తుంది. ఆచంట మండలంలో మురుగంతా నక్కల డ్రెయిన్ ద్వారా గోదావరిలో కలుస్తుంది. ఈ డ్రెయిన్ గోదావరి కలిసే చోట అవుట్ ఫాల్స్ స్లూయిజ్ ఏర్పాటుచేశారు. గోదావరికి వరదలు వచ్చినప్పుడు గోదావరిలో నీరు డ్రెవ్‌లోకి ఎగదన్నకుండా ఆటోమేటిక్ తలుపులు ఏర్పాటు చేశారు. ఈ నేపథ్యంలో మండలంలో 15 రోజులుగా వశిష్ట గోదావరి వరద ఉగ్రరూపం దాల్చడంతో అవుట్ పాల్స్ ఆటోమెటిక్‌గా మూసుకుపోతాయి. ప్రస్తుతం లక్ష్మీపాలెంలో ఒక అవుట్ ఫాల్స్ గేటు పనిచేయకపోవడంతో గోదావరిలో వరద నీరు పైకి ఎగదన్నడంతో

పెనుమంచిలి గ్రామంలో నీటమునిగిన పంట పొలాలు

ఆచంట మండలంలో వారంరోజుల వ్యవధిలోనే ఆచంట మండలంలో సుమారు 2500 ఎకరాలు ముంచేసింది. గోదావరి వరద పూర్తిస్థాయిలో తగ్గకపోవడంతో మురుగునీరు లాగే పరిస్థితి కనిపించడం లేదు. ఇదే పరిస్థితి కొనసాగితే మరిన్ని గ్రామాల్లో చేలు ముంపునకు గురయ్యే ప్రమాదం ఉంది. ఎకరాకు ఎప్పటికీ రూ.10 నుంచి రూ.12 వేల వరకూ పెట్టుబడులు పెట్టి వేసినా రైతులకు దిక్కు తోచడం లేదు. ప్రకృతి కరుణిస్తే తప్ప ముంపు నుంచి బయటపడే పరిస్థితి లేదని రైతులు వాపోతున్నారు.

చేలు కుళ్లిపోతాయి..

కావాడి సుబ్బారావు, కానుపోతుగుంట, కౌలు రైతు

రెండెకరాలు కౌలుకు చేస్తున్నాను. ఎకరాకు సుమారు రూ.12,500 వరకూ ఖర్చు చేసి నాట్లు వేశాను. నక్కల డ్రెయిన్ పొంగిపోవడంతో చేను మునిగిపోయింది. వారం రోజులుగా చేను నీటిలోనే ఉంది. గోదావరి వరద నీరు ఎప్పుడు తగ్గుతుందో, పొలాల్లో నీరు ఎప్పుడు లాగుతుందో అర్థం కావడం లేదు. ఇప్పటికే నాట్లు కుళ్లిపోయాయి. ప్రభుత్వం స్పందించి కౌలు రైతులకు న్యాయం చేయాలి.

రూ.లక్ష పెట్టుబడి పెట్టాను..

బొక్క ఏసుబాబు, కౌలు రైతు, కానుగపోతుగుంట

నేను తొమ్మిదెకరాలు కౌలుకు తీసుకుని సాగు చేస్తున్నాను. ఎకరాకు సుమారు రూ.10 వేల వరకూ ఖర్చు చేశాను. అధిక వర్షాలు, వరదల వల్ల నక్కల డ్రెయిన్ పొంగి ప్రవహించడంతో నిండా మునిగిపోయాను. బ్యాంకు రుణాలు ఇవ్వకపోవడంతో అధిక వడ్డీలకు అప్పులు చేసి పెట్టుబడులు పడితే చివరికి ప్రకృతి అనుకూలించకపోవడంతో అప్పుల ఊబిలో కూరుకుపోయాను. ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం ప్రభుత్వాలు చూపించాలని కోరుతున్నాను. నష్టపోయిన కౌలు రైతులకు ప్రభుత్వం తక్షణం నష్టపరిహారం ఇప్పించాలి.

దుబ్బు కుళ్లిపోయింది..

బొక్కా తిరుమలరావు, కౌలు రైతు, పెనుమంచిలి

డ్రెయిన్‌ను ఆనుకొని మా పొలం ఉండడంతో ప్రస్తుతం నాలుగడుగుల మేర నీరు చేరింది. వారం రోజులుగా ఇదే పరిస్థితి ఉండడంతో దుబ్బు కుళ్లిపోతోంది. మూడు ఎకరాలుసాగు చేస్తున్నాను. ఎంటియుపిఆర్ 1318 రకం వచ్చాను. గోదావరికి వరదలు వచ్చినప్పుడు గోదావరిలో నీరు డెయిన్లోకి ఎగదన్నకుండా ఆటోమేటిక్ తలుపులు ఏర్పాటు చేశారు. ఆ తలుపులు ఎప్పుడు ఒకటి పని చేయకపోవడంతో గోదావరిలో నీరు నక్కల డ్రెయిన్‌లోకి ఎగదన్నడంతో ఇప్పుడు పంటలన్నీ నీటిపాలయ్యాయి. తక్షణ అధికారులు స్పందించి తలుపులకు మరమ్మతులు చేయించాలి.

ఏటా అప్పులే మిగులుతున్నాయి..

చిట్టూరి వెంకట సత్యనారాయణ, కౌలు రైతు, పెనుమంచిలి

నేను రెండున్నర ఎకరాలు కౌలుకు చేస్తున్నాను. ఏటా అధిక వర్షాలు, గోదావరికి వరదలు రావడంతో వారం రోజులుగా పంట పొలాలు ముంపులోనే ఉన్నాయి. ఎకరాకు రూ.పది వేల వరకూ పెట్టుబడులు పెట్టాను. వర్షం కురిస్తే నక్కల డ్రెయిన్ పొంగి ఆచంట వేమవరం, పెనుమంచిలి పంట పొలాలు మునిగిపోతాయి. గత ప్రభుత్వం ముంపు నివారణకు చర్యలు తీసుకోకపోవడంతో డ్రెయిన్‌లో గుర్రపు డెక్క తూడు పేరుకుపోయింది. దీంతో నీరు లాగే పరిస్థితి లేదు. ప్రభుత్వం స్పందించి నష్టపరిహారం చెల్లించాలి.

పేదలకు ఆసరాగా ఎన్‌టిఆర్ భరోసా

జిల్లాలో 2,31,874 మంది పింఛన్ దారులకు రూ.97.26 కోట్లు అందజేత

జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి

ప్రజాశక్తి - భీమవరం

వృద్ధురాలికి పింఛను అందజేస్తున్న కలెక్టర్ నాగరాణి

ప్రభుత్వం వయో వృద్ధులు, వికలాంగులకు పెన్షన్ మొత్తాన్ని అధికంగా పెంచి ఆసరాగా నిలిచిందని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. గురువారం స్థానిక మారుతీనగర్ 7వ వార్డు లెప్రసీ కాలనీలో ఎన్‌టిఆర్ భరోసా పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో కుష్టు వ్యాధిగ్రస్తులకు, వయోవృద్ధులకు, వికలాంగులకు జిల్లా కలెక్టర్ నాగరాణి చేతుల మీదుగా పింఛన్లు అందజేశారు. ఈ సందర్భంగా లబ్ధిదారులతో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ వయా వృద్ధులు, వికలాంగులకు ప్రభుత్వం బాసటగా నిలిచేందుకే పింఛన్లను ఎక్కువ మొత్తంలో పెంచి అందిస్తున్నట్లు తెలిపారు. లబ్ధిదారులు పింఛన్లను పొదుపు చేసుకొని అవసరాలకు వినియోగించుకోవాలన్నారు.

లెప్రసీ కాలనీవాసులకు మౌలిక వసతులు మెరుగుపర్చాలి

పింఛన్ల పంపిణీ అనంతరం లెప్రసీ కాలనీలోని ప్రతి గృహానికీ జిల్లా కలెక్టర్ స్వయంగా వెళ్లి వారి యోగ క్షేమాలు అడిగి తెలుసుకోవడంతో పాటు, కాలనీలో వారికి ఉన్న ఇబ్బందులపై ఆరా తీశారు. కొంతమందికి ఇళ్లు లేవని, మరుగుదొడ్లు ఇబ్బందిగా ఉన్నాయని కలెక్టర్‌కు కాలనీవాసులు వివరించారు. గృహాల అవసరం ఉన్న ప్రతి ఒక్కరినీ ట్యాగింగ్ చేయాలని, అలాగే మరుగుదొడ్ల నిర్మాణానికి అవసరమైన ప్రతిపాదనలను వెంటనే సిద్ధం చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఒక నెలలోనే కాలనీలో మార్పు కనిపించాలని మున్సిపల్ కమిషనర్‌కు సూచించారు. పారిశుధ్య నిర్వహణ మెరుగైన రీతిలో ఉండాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిఆర్‌డిఎ ప్రాజెక్ట్ డైరెక్టర్ ఎంఎస్ఎస్ వేణుగోపాల్, మున్సిపల్ కమిషనర్ ఎం.శ్యామల, సహాయ కమిషనర్ ఎ.శ్రీవిద్య, ఎపిఐఎ పెన్షన్స్ టి.మురళీకృష్ణ పాల్గొన్నారు.

వరద తగ్గింది.. బురద మిగిలింది

రహదారులపై నిలిచిన బురదతో లంకగ్రామాల ప్రజల అవస్థలు

ప్రజాశక్తి - యలమంచిలి

కనకాయలంకలో రోడ్డుపై చెత్త తొలగిస్తున్న గ్రామస్తులు

గత పది రోజులకుపైగా లంక గ్రామాల ప్రజలకు కంటిమీద కునుకులేకుండా చేసిన గోదావరి వరద గురువారం ఉదయం వరకూ నిలకడగా కొనసాగినా సాయంత్రానికి తగ్గుముఖం పట్టింది. అయితే వరద తగ్గినా వరద తాలూకా బురద మాత్రం ఆయా లంక గ్రామాల్లోని రహదారులపై భారీగా పేరుకుపోవడంతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. దీంతో నిన్నటి వరకూ వరదతో నేటి నుండి బురదతో ఇబ్బందులు పడాల్సి వస్తోందని లంక గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇదిలా ఉండగా కనకాయలంక కాజ్‌వేపై ఇంకా వరదనీరు తీయకపోవడంతో అక్కడి ప్రజలు పడవలపై రాకపోకలు సాగిస్తున్నారు. నక్కలకాలువ, కాజా డ్రెయిన్ల ప్రభావంతో ఏనుగువానిలంక, పల్లిపాలెం, పెద్ద హరిజన పేట, చింతదిబ్బ, గుంపర్రు తదితర గ్రామాలు వరద నీటి నుంచి తేరుకోకపోవడంతో ఆయా గ్రామాల ప్రజలు అసౌకర్యానికి గురవుతున్నారు.

నరసాపురం: నరసాపురం పట్టణం పొన్నపల్లి వరద కారణంగా ముంపునకు గురైంది. ఇప్పటికే రెండు రోజుల నుంచి కాలనీలో నీరు ఇళ్లలోకి చేరుకుంది. మున్సిపల్ అధికారులు విద్యుత్ మోటార్ల సాయంతో వరద నీటిని గోదావరిలోకి తోడుతున్నారు. ధవళేశ్వరం బ్యారేజ్ వద్ద లక్షల క్యూసెక్కుల నీరు సముద్రంలోకి వదిలేయడంతో గోదావరి ఉగ్రరూపం తగ్గలేదు. ఇప్పటికే స్నాన ఘట్టాల్లో నీరు ఎక్కువగా ఉంది.

ఆచంట: గత 12 రోజులపాటు ఉగ్రరూపం దాల్చిన వశిష్టగోదావరి శాంతించడంతో ఆచంట మండలంలోని లంక గ్రామాలు జలదిగ్బంధం నుంచి బయటపడ్డాయి. గత 2 రోజుల నుంచి లంక గ్రామాలైన అయోధ్య లంక, పచ్చలంక, భీమలాపురం, గ్రామాలలో వరదనీరు పూర్తిగా తొలగిపోయింది. లోతట్టు ప్రాంతాలను ముంచెత్తడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న స్థానికులు వరద తొలగడంతో కాస్త ఊపిరి పీల్చుకున్నారు. పలు ఇళ్ల చుట్టూ చేరిన వరద నీరు తిరిగి గోదావరిలోకి చేరింది. కోడేరు, భీమలాపురం, కరుగోరుమిల్లి, పెదమల్లం పుష్కర్ ఘాటులు నీట నుంచి తీరుకున్నాయి. పెదమల్లం, మచేనమ్మ అమ్మవారి ఆలయం వద్ద పుష్కర ఘాటులో దాదాపు నాలుగు అడుగులు మేర వరద తగ్గింది. నదిలో వరద ప్రవాహ వేగం ఇంకా తగ్గకపోవడంతో నాటు పడవల రాకపోకలపై నిషేధం కొనసాగుతుంది. వరద తగ్గుముఖం పట్టడంతో మండలంలోని లంక గ్రామాల ప్రజలతోపాటు అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. స్పెషలాఫీసర్ పిచ్చయ్య తహశీల్దార్ ఐపీ శెట్టి, ఎంపిడిఒ పి.నరసింహ ప్రసాద్ ఆధ్వర్యంలో రెవెన్యూ అధికారులు వరద సహాయక చర్యలు పర్యవేక్షిస్తున్నారు. వరద ఇంకా ఉధృతంగానే ఉండడంతో లంక గ్రామాల మధ్య పడవ ప్రయాణాలకు అధికారులు అనుమతులు ఇవ్వలేదు. దీంతో లంక వాసులకు రాకపోకలు లేకుండా పోయాయి. ఆచంట ఎస్ఐ రాజకుమార్ ఆధ్వర్యంలో పుష్కర ఘాట్ల వద్ద పోలీసు బందోబస్తు కొనసాగుతుంది. ముంపు బారిన పడిన భీమలాపురంలోని ఏటిగట్టు దిగువ ప్రాంతానికి చెందిన కాపులపాలెం కాలనీ వాసులు ఊపిరి పీల్చుకున్నారు.

ప్రత్యేక హోదా కోసం పోరాడాలి

సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు మంతెన సీతారాం

ప్రజాశక్తి - తణుకు

మాట్లాడుతున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు సీతారాం

రాష్ట్రం అభివృద్ధి జరగాలంటే ప్రత్యేక హోదా కోసం పోరాటం చేయాల్సిందేనని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు మంతెన సీతారాం అన్నారు. గురువారం స్థానిక లయన్స్ క్లబ్‌లో సిపిఎం జిల్లా విస్తృత సమావేశం జరిగింది. ఈ సమావేశానికి అధ్యక్ష వర్గంగా జెఎన్‌వి గోపాలన్, పివి.ప్రతాప్, కేతా గోపాలన్, చింతకాయల బాబూరావు, డి.కళ్యాణి వ్యవహరించారు. ఈ సందర్భంగా మంతెన సీతారాం మాట్లాడుతూ విశాఖ ఉక్కు పరిశ్రమ ప్రయివేటీకరణ ఆపాలని లేకుంటే సిపిఎం ఆందోళన సాగిస్తుందని తెలిపారు. కేంద్రం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో ప్రాధాన్యత రంగాలకు నిధులు తగ్గించడం, పేద ప్రజలపై భారాలు వేసే విధంగా ఉందని విమర్శించారు. బడ్జెట్‌లో మన రాష్ట్రానికి కేంద్రం నేరుగా ఇవ్వాలని, అప్పులు ఇప్పించడం కాదని అన్నారు. పెరుగుతున్న పెట్రోల్, డిజిల్, గ్యాస్, నిత్యావసర ధరలు తగ్గించాలని డిమాండ్ చేశారు. సిపిఎం జిల్లా కార్యదర్శి బి.బలరాం మాట్లాడుతూ వర్షాల వల్ల నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు. జిల్లాలో రోజు రోజుకూ పెరుగుతున్న కాలుష్యాన్ని అరికట్టే చర్యలు చేపట్టాలన్నారు. టిడ్కో ఇళ్లు వెంటనే పూర్తి చేసి లబ్ధిదారులకు ఇవ్వాలన్నారు. రోడ్లు, డ్రెయినేజీ వంటి సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం కార్యదర్శి వర్గ సభ్యులు కౌరు పెద్దిరాజు, నేతలు బి.వాసుదేవరావు, రాజా రామ్మోహన్‌రాయ్, జుత్తిగ నర్సింహమూర్తి, జవ్వాది శ్రీనివాస్, ఐద్వా నేతలు పి.పూర్ణ, అడ్డగర్ల అజయకుమారి పాల్గొన్నారు.

ఇజ్రాయిల్ దుర్మార్గాన్ని ఖండించాలి

సిపిఎం మండల కార్యదర్శి అశ్రియ

ప్రజాశక్తి - పాలకోడేరు

ఆందోళన చేస్తున్న సిపిఎం నేతలు

పాలస్తీనాపై ఇజ్రాయిల్ చేస్తున్న దుర్మార్గాన్ని యావత్ ప్రపంచమంతా ఖండించాలని సిపిఎం మండల కార్యదర్శి శేషాపు అశ్రియ డిమాండ్ చేశారు. విస్సాకోడేరులో పాలస్తీనాకు మద్దతుగా గురువారం ర్యాలీ నిర్వహించారు. స్థానిక వంకాయపాలెం వెళ్లే రహదారి నుంచి విస్సాకోడేరు రావిచెట్టు సెంటర్ వరకూ ర్యాలీ నిర్వహించి ప్రజల మద్దతు కూడగట్టారు. ఈ సందర్భంగా అశ్రియ మాట్లాడుతూ పాలస్తీనాపై ఇజ్రాయేలు అతిక్రూరంగా దాడి చేస్తోందన్నారు. చిన్నారులు, మహిళలు అని చూడకుండా నరమేధానికి పాల్పడుతోందన్నారు. ఇజ్రాయిల్‌కు అమెరికా మద్దతు పలకడం అత్యంత దుర్మార్గమన్నారు. అమెరికాకు భారత ప్రభుత్వం వత్తాసు పలకడం ఎంతవరకూ సమంజసమని ప్రశ్నించారు. బిజెపి ప్రభుత్వం తన వైఖరిని మార్చుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు కలిదిండి గోపాలరాజు, ఆనంద్, రామారావు, సత్యనారాయణ పాల్గొన్నారు.

న్యూట్రిషన్ డైట్ తప్పనిసరిగా తీసుకోవాలి

మలేరియా ఇన్‌ఛార్జి అధికారి డాక్టర్ రవికుమార్

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం


మాట్లాడుతున్న మలేరియా ఇన్‌ఛార్జి అధికారి రవికుమార్

మంచి ఆరోగ్యపు అలవాట్లు, వ్యాధినిరోధక శక్తిని పెంచుకోవడానికి న్యూట్రిషన్ డైట్ తప్పనిసరిగా తీసుకోవాలని జిల్లా మలేరియా ఇన్‌ఛార్జి అధికారి డాక్టర్ కోసూరి రవికుమార్ తెలిపారు. గురువారం ఆయన తాడేపల్లిగూడెం మలేరియా సబ్ యూనిట్ అధికారి వైవి.లక్ష్మణరావుతో కలిసి పెదతాడేపల్లి డాక్టర్ బిఆర్.అంబేద్కర్ గురుకుల పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దోమకాటు ద్వారా వచ్చే వ్యాధులను నియంత్రించుటలో, నీరునిల్వలు లేకుండా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుటలో ప్రతి ఒక్కరూ బాధ్యతతో కలిగి ఉండాలన్నారు. అలాగే ప్రతి శుక్రవారం డ్రై డే పాటించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో గురుకులం పాఠశాల ప్రిన్సిపల్ వి.రాజారావు, తాడేపల్లిగూడెం మలేరియా సబ్ యూనిట్ అధికారి వైవి.లక్ష్మణరావు, పెద తాడేపల్లి ఉపకేంద్ర సిబ్బంది ప్రవళిక, ఎంఎల్‌హెచ్‌పి, ఆరోగ్య కార్యకర్త పద్మ, ఆరోగ్య సహాయకులు ఇ.కాంతారావు, ఆశాలు పాల్గొన్నారు.

ఇబ్బంది లేకుండా ఇసుక సరఫరా చేయాలి

బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ నాయకులు వీరభద్రరావు

ప్రజాశక్తి - తణుకు

ప్రజలకు అవసరమైన ఇసుక ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఉచితంగా సరఫరా చేయాలని వేల్పూరు బిల్డింగ్ వర్కర్స్ యూనియన్(సిఐటియు) గౌరవ అధ్యక్షులు బళ్ల చిన వీరభద్రరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ సమావేశం వేల్పూరు స్థానిక పార్వతీదేవి ఆలయ ప్రాంగణంలో వాటాల నాగేశ్వరరావు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా వీరభద్రరావు మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే ఉచిత ఇసుక సరఫరా చేస్తామని ప్రజలకు హామీ ఇచ్చిన ప్రస్తుత ప్రభుత్వం అధికారం చేపట్టి నెలలు గడుస్తున్నప్పటికీ నేటికీ ఇచ్చిన హామీని అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని ఆయన విమర్శించారు. ఇసుక దొరక్క ప్రస్తుతం కొనసాగుతున్న ఇంటి నిర్మాణాలకు అవసరమైన ఇసుక కోసం నానా తంటాలు పడుతున్నా దొరకని పరిస్థితి నెలకొందని, దీంతో చాలావరకు చివరి దశకు చేరుకున్న గృహాలు మధ్యలో నిలిచిపోయాయని వీరభద్రరావు తెలిపారు. ఉచిత ఇసుక ఇస్తామని హామీ ఇస్తే ప్రజలు, కార్మికులు చాలా సంతోషించారని, కానీ ఇసుక అందని ద్రాక్షగా మారిందని ఆయన వాపోయారు. గత వైసిపి ప్రభుత్వ హయాంలో మూడు యూనిట్ల ధర రూ.7,500కు దొరికితే ఇప్పుడు కూటమి ప్రభుత్వ పాలనలో మూడు యూనిట్ల ధర రూ.10,600కు విక్రయించడం దుర్మార్గమన్నారు. ఉచిత ఇసుక అంటూ ప్రసారం చేసి ప్రజలకు ఇసుక దొరకకుండా చేస్తారా అని వీరభద్రరావు ప్రశ్నించారు. బ్లాక్‌లో సాగుతున్న ఇసుక దందాను ప్రభుత్వం కట్టడి చేయకపోవడం వల్ల భవన నిర్మాణాలు మధ్యలోనే ఆగిపోయి, కార్మికులకు ఉపాధి లేకుండా పోయిందని, ఇసుక సరఫరాపై ప్రభుత్వం తగిన చర్యలు తీసుకుని, ఎన్నికల ముందు ఇచ్చిన ఉచిత ఇసుక హామీని అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. లేకుంటే ఇదే విధానం కొనసాగితే భవిష్యత్తులో ప్రజలు, కార్మికులు ఉద్యమాలకు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో తిరునాదం వెంకటేశ్వరరావు, యాతం శ్రీను, విప్పర్తి రవీంద్ర, గుడిమెట్ల రాధాకృష్ణ, ఆనందం గంగాధర రావు, యాతం పెద్దిరాజు, ముదిగొండ రాముడు, సోరపల్లి రామకృష్ణ, షేక్ ఇస్మాయిల్ పాల్గొన్నారు.

కళాశాలలో ప్రపంచ కేన్సర్ దినోత్సవం

ప్రజాశక్తి - పాలకొల్లు

స్థానిక ఎఎస్ఎన్ఎం ప్రభుత్వ కళాశాలలో హెల్త్ కేర్ డిపార్ట్మెంట్ ఆధ్వర్యంలో 'ప్రపంచ ఊపిరితిత్తి కేన్సర్ రోజును' నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ టి.రాజరాజేశ్వరి పాల్గొన్నారు. విద్యార్థులతో మాట్లాడుతూ ప్రపంచ కేన్సర్ దినోత్సవంను ప్రతి సంవత్సరం ఆగస్టు 1వ తేదీన జరుపుకుంటారని చెప్పారు. కేన్సర్ రోగుల పట్ల అవగాహన, విముక్తి కలిగించే విధంగా, క్యాన్సర్ పట్ల జాగ్రత్తలు వహించడానికి, ఊపిరితిత్తులలో కలిగే రుగ్మతలను తెలుసుకోవడానికి, పొగతాగడం, మద్యం సేవించడం, ఇతర ధూమపాన నివారణా చర్యలను తెలియజేశారు. విద్యార్థులు, ప్రజలు ఈ రుగ్మతకు దూరంగా ఉండాలని, ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని, మంచి జీవితం జీవించాలని, తద్వారా భవిష్యత్తును ఉజ్వలంగా తీర్చిదిద్దుకోవాలని కోరారు. చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని కోరారు. ఈ కార్యక్రమానికి హెల్త్ కేర్ డిపార్ట్మెంట్ కో-ఆర్డినేటర్ కుమారి, పి.జ్యోత్స్నశ్రీ, డాక్టర్ ఎం.రామకృష్ణ, పి.శ్రీనివాసరావు, వి.శిరీష మొదలగు అధ్యాపకులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ రాజరాజేశ్వరి

తల్లిపాలతోనే బిడ్డకు రక్షణ

జిల్లా కలెక్టర్ నాగరాణి

ప్రజాశక్తి - భీమవరం

వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్

తల్లిపాలతోనే తల్లి బిడ్డకు రక్షణ అని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. గురువారం భీమవరం ఏరియా హాస్పిటల్‌లో అంతర్జాతీయ తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా ఏర్పాటుచేసిన సమావేశంకు ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. పుట్టిన బిడ్డకు తల్లిపాలు పడితే బిడ్డతో పాటు తల్లి కూడా ఆరోగ్యంగా ఉంటుందని అన్నారు. అమృతంలా పనిచేసే తల్లిపాలు కనీసం ఆరు మాసాల వరకూ బిడ్డకు అందజేయాలన్నారు. పుట్టిన బిడ్డకు గంటలోపే తల్లిపాలు ఇవ్వాలని సూచించారు. అమృతంలా పనిచేసే తల్లిపాలు బిడ్డకు ఆరు నెలలు అందిస్తే అవసరమైన పోషకాలు బిడ్డకు అందుతాయని తెలిపారు. ఆగస్టు 1 నుంచి 7వ తేదీ వరకూ తల్లిపాల వారోత్సవాల సందర్భంగా తల్లిపాలు విశిష్టతపై జిల్లాలో ప్రతి గ్రామంలో, ప్రతి ఇంటింటికీ వెళ్లి ఏడు రోజులపాటు వైద్య ఆరోగ్యశాఖ, స్త్రీ శిశుసంక్షేమ శాఖ సమన్వయంతో అవగాహన కల్పించాలన్నారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ డి.మహేశ్వరరావు మాట్లాడుతూ తల్లిపాలు బిడ్డలకు టీకాల మాదిరిగా పనిచేస్తాయని, పిల్లలు ధృఢత్వంగా, ఆరోగ్యంగా పెరుగుతారని అన్నారు. జిల్లా స్త్రీ శిశుసంక్షేమ శాఖ అధికారి పి.సుజాత రాణి మాట్లాడుతూ తల్లీ బిడ్డకు ఏ సమయంలో పాలు ఇవ్వాలి, ఏ భంగిమలో ఇస్తే మంచిది అని క్షేత్రస్థాయిలోకి వెళ్లి తమ శాఖ సిబ్బంది ద్వారా తెలియజేయడం జరుగుతుందన్నారు. గర్భిణులకు, బాలింతలకు వివిధ రకాల పళ్లను జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా అందించారు. తల్లిపాలు అమృతం, డబ్బా పాలు వద్దు అని ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం తల్లిపాల వారోత్సవాల సమాచారం వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఏరియా హాస్పిటల్ సూపరింటెండెంట్ డాక్టర్ వి.మాధవీకళ్యాణి, శ్రీవిజ్ఞాన వేదిక కన్వీనర్ చెరుకువాడ రంగసాయి, వైద్యులు డాక్టర్ ప్రవీణ్, సిబ్బంది పాల్గొన్నారు.

కృషి, పట్టుదలతో ఉన్నత శిఖరాలకు..

అభినందన సభలో ఎంఎల్ఎ బొలిశెట్టి

తాడేపల్లిగూడెం: కృషి, పట్టుదల, ఏకాగ్రత ఉంటే ఎంతటి ఉన్నత శిఖరాలనైనా అధిరోహించవచ్చని, అందుకు నిదర్శనంగా వాణి పబ్లిక్ స్కూల్ విద్యార్థిని ఉప్పు మేఘన రమ్యశ్రీ నిలుస్తుందని తాడేపల్లిగూడెం ఎంఎల్ఎ బొలిశెట్టి శ్రీనివాస్ అన్నారు. వాణి పబ్లిక్ స్కూల్ విద్యార్థిని ఉప్పు మేఘనా రమ్యశ్రీ ట్రిపుల్ ఐటీకి ఎంపికైన సందర్భంగా వాణి పబ్లిక్ స్కూల్లో గురువారం ఏర్పాటు చేసిన అభినందన సభకు ఎంఎల్ఎ బొలిశెట్టి శ్రీనివాస్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ట్రిపుల్ ఐటీకు ఎంపికైన మేఘనాకు అవసరమైన సహాయ సహకారాలను, ఆర్థికపరంగా తాను వ్యక్తిగతంగాను సహాయం అందిస్తానని హామీ ఇచ్చారు. మరో ముఖ్యఅతిథి టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి వలవల బాబ్జి మాట్లాడుతూ వాణి విద్యార్థులు చదువుతోపాటు అన్ని రంగాలలోనూ రాణిస్తున్నారని, పదవ తరగతిలో 591 అత్యధిక మార్కులతో నిలవడమే కాక ట్రిపుల్ ఐటికు కూడా ఎంపిక కావడం వాణి పబ్లిక్ స్కూల్ చక్కటి శిక్షణా సామర్థ్యానికి నిదర్శనమని, ఈ సందర్భంగా ట్రిపుల్ ఐటీ విద్యార్థిని మేఘనకు తన వంతు సహాయ సహకారాలు అందిస్తానని తెలియజేశారు. ఈ సందర్భంగా మేఘన రమ్యశ్రీకి ట్రిపుల్ ఐటీ అడ్మిషన్ ఐడెంటి కార్డును వేసి, పుష్పగుచ్ఛాన్ని అందించి ఎంఎల్ఎ బొలిశెట్టి శ్రీనివాస్ అభినందించారు.

నరసాపురం డిఎస్‌పిగా మురళీకృష్ణ

పాలకొల్లు: నరసాపురం డిఎస్‌పిగా ఎన్‌బిఎం.మురళీకృష్ణ నియమితులయ్యారు. ప్రస్తుతం ఆయన 5వ బెటాలియన్ డిఎస్‌పిగా పనిచేస్తున్నారు. ప్రస్తుతం డిఎస్‌పిగా పనిచేస్తున్న జి.శ్రీనివాసరావు కృష్ణ జిల్లా డిఎస్‌పిగా బదిలీ అయ్యారు. రాష్ట్రవ్యాప్తంగా 93 మంది డిఎస్‌పిల బదిలీలలో భాగంగా డిఎస్‌పిల బదిలీలు జరిగాయి.

గణపవరం తహాశీల్దార్ బదిలీ

గణపవరం: గణపవరం తహాశీల్దార్ ఎడ్ల రాంబాబు గురువారం బదిలీ అయ్యారు. సార్వత్రిక ఎన్నికల ముందు ముమ్మిడివరం నుంచి గణపవరం తహాశీల్దార్‌గా వచ్చిన రాంబాబు మరలా కోనసీమ జిల్లాకు బదిలీ అయ్యారు. ఇన్‌ఛార్జి తహాశీల్దార్‌గా గణపవరం డిటిఎం సన్యాసిరావు బాధ్యతలు తీసుకున్నారు.

మహిళా ప్రతినిధిగా ప్రగతి

నరసాపురం: అత్యంత ప్రతిష్టాత్మకంగా జరిగిన నరసాపురం బార్ అసోసియేషన్ న్యాయవాదుల సంఘం ఎన్నికలలో మహిళా ప్రతినిధిగా బొడ్డు ప్రగతి 96 ఓట్ల భారీ మెజారిటీతో రొక్కల జెసికళపై గెలుపొందటం జరిగింది. ఈ ఎన్నికలలో మొత్తం 177 మంది ఓటర్లకు 167 మంది తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. అందులో 3 ఓట్లు చెల్లలేదు. మిగిలిన 164 ఓట్లలో బొడ్డు ప్రగతికి 130 ఓట్లు రాగా కేవలం 34 ఓట్లు మాత్రమే రొక్కల జెసికళకు వచ్చాయి. ప్రముఖ సీనియర్ న్యాయవాది వనమాల శ్రీనివాస్ భార్య అయినటువంటి ప్రగతి నరసాపురం కోర్టులో న్యాయవాదిగా 14 సంవత్సరాల నుంచి ప్రాక్టీస్ చేస్తున్నారు. ఆమె ఎన్నికల అధికారి నలిమిల్లి జోసఫ్ చేతుల మీదగా డిక్లరేషన్ పత్రాన్ని అందుకున్నారు.

వెంకట సత్యనారాయణ రాజుకు సన్మానం

ఆకివీడు: టిడిపి అధికారంలోకి వచ్చిన మరుసటి రోజు నుంచి మండల కేంద్రం ఆకివీడులో టిడిపి ఆధ్వర్యంలో అన్నా క్యాంటీన్ నిర్వహిస్తున్నారు. ఈ క్యాంటీన్ బాధ్యతలు, ఆర్థిక బాధ్యతలు పూర్తిగా టిడిపి నాయకులు, ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షులు గొట్టుముక్కల వెంకట సత్యనారాయణ రాజు స్వయంగా నిర్వహిస్తున్నారు. ఈ క్యాంటీన్ నిర్వహణ ప్రారంభించి నేటికి 50 రోజులు పూర్తయి 51వ రోజుకు చేరింది. దీంతో క్యాంటీన్ స్వయంగా ఖర్చులు వెచ్చించి నిర్వహిస్తున్న సత్యనారాయణ రాజును ఆ పార్టీ మండల అధ్యక్షులు మోటుపల్లి ప్రసాద్, ఇతర నాయకులు గురువారం క్యాంటీన్ ప్రాంగణంలో సన్మానించారు. ఈ సందర్భంగా పలువురు ఆయన చేసిన సేవలను కొనియాడారు.

వేలం పాట రూ.2.97 కోట్లకు తగ్గిస్తూ తీర్మానం

నరసాపురం: నరసాపురం-సఖినేటిపల్లి మధ్య గోదావరిపై పెర్రీ జాయింట్ యాక్షన్ కమిటీ గురువారం నరసాపురం మండల పరిషత్ కార్యాలయంలో సమావేశం నిర్వహించింది. గతంలో రూ.3.61 కోట్లకు వేలంపాట పాడగా అదే ధరకు పాట నిర్వహించేందుకు అధికారులు టెండర్లు పిలిచినా కాంట్రాక్టర్లు ముందుకు రాలేదు. దీంతో ధరను రూ.2.97 కోట్లకు తగ్గించాలని కోరుతూ జాయింట్ యాక్షన్ కమిటీ నిర్ణయించింది. ఈమేరకు తీర్మానం చేసి సిఇఒకు పంపినట్లు ఎంపిడిఒ తెలిపారు.

సంక్షేమ పథకాల పునరుద్ధరణ హర్షణీయం

కాళ్ల: ప్రస్తుత టిడిపి కూటమి ప్రభుత్వం ఎస్‌సి, ఎస్‌టి, బిసి మైనార్టీలకు రావలసిన పథకాలు పునరుద్ధరిస్తామని ఎస్‌సి, ఎస్‌టి, బిసి సంక్షేమ పథకాలు, కార్పొరేషన్ల ద్వారా రుణాలు మంజూరు చేస్తామని అసెంబ్లీ వేదికగా ప్రభుత్వం చెప్పడం హర్షణీయమని ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనారిటీ సమైఖ్య వ్యవస్థాపక అధ్యక్షులు సోడదాసి గంగయ్య గురువారం తెలిపారు. పశ్చిమగోదావరి జిల్లా కమిటీ నూతన కార్యవర్గాన్ని ఎంపిక చేసి నియమక పత్రాలను అందజేశామన్నారు. జిల్లా ఉపాధ్యక్షులుగా గుడిసె అనిల్ కుమార్, జిల్లా గౌరవాధ్యక్షులుగా మర్రి కృపదానం, జిల్లా ట్రెజరర్‌గా గుర్రం వెంకటరత్నం, జిల్లా ప్రధాన కార్యదర్శిగా తాళ్లూరి రాజకుమార్, ఉండి నియోజకవర్గ కార్యదర్శిగా చోడదాసి రతన్ రాజు, ఉండి నియోజకవర్గ కార్యదర్శిగా కొండ రాజేష్ కుమార్, ఉండి నియోజకవర్గ కార్యదర్శి ఓగిరాల శ్యాంసుందర్, కాళ్ల మండల అధ్యక్షులుగా గరికి ముక్కల అశోక్ కుమార్, కాళ్ల మండల సహాయ కార్యదర్శిగా నేతల నతనియేలు, కాళ్ల మండల కార్యదర్శిగా గాతల మణిరాజు, కాళ్ల మండల ట్రెజరర్‌గా సఖిలే శ్రీనివాసరావు, జక్కరం గ్రామ కమిటీ అధ్యక్షులుగా మేడిది యేసయ్య, కోలనపల్లి గ్రామ కమిటీ అధ్యక్షులుగా బొంటుమిల్లి జేమ్సులు ఎన్నికయ్యారు.

దళితులపై అత్యాచారాలను అరికట్టాలి

ఐఎఫ్‌టియు జిల్లా ఉపాధ్యక్షులు రామ్మోహన్

ఆకివీడు: దళితులపై హత్యలు, అత్యాచారాలను అరికట్టాలని ఐఎఫ్‌టియు జిల్లా ఉపాధ్యక్షులు రామ్మోహన్ డిమాండ్ చేశారు. కారంచేడు, చుండూరు ఘటనకు నిరసనగా జులై 17 నుంచి ఆగస్టు 6 వరకూ నిరసనలు, ఆందోళనలు నిర్వహించాలని భారత కార్మిక సంఘాల సమాఖ్య ఐఎఫ్‌టియు రాష్ట్ర కమిటీ ఇచ్చిన పిలుపులో భాగంగా స్థానిక మండల కమిటీ ఆధ్వర్యంలో గురువారం దుంపగడప రోడ్డులో నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఐఎఫ్‌టియు మండల కార్యదర్శి తోట రామకృష్ణ అధ్యక్షతన సభ జరిగింది. ఈ సభలో ఐఎఫ్‌టియు జిల్లా ఉపాధ్యక్షులు ఎస్.రామ్మోహన్ మాట్లాడుతూ కారంచేడు, చుండూరు ఘటనల నుంచి నేటి వరకూ దళితులపై హత్యలు, అత్యాచార ఘటనలు జరుగుతూనే ఉన్నాయని అన్నారు. రాజ్యాంగంలో దళితులకు రక్షణగా ఉన్న చట్టాలన్నీ రక్షణ కల్పించడం లేదని తెలిపారు. ఈ మధ్యకాలంలో దళితులపై దాడులే కాకుండా మహిళలపై అఘాయిత్యాలు రోజురోజుకీ పెచ్చరిల్లిపోతున్నాయన్నారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం దళితుల కోసం ఉన్న పథకాలను అమలు చేయాలని రామ్మోహన్ డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అజయ్ కుమార్, హనుమంతు పాల్గొన్నారు.

సర్పంచి పల్లయ్య మృతి

మొగల్తూరు: మండలంలోని ముత్యాలపల్లి గ్రామ సర్పంచి కోపనాతి పల్లయ్య బుధవారం తెల్లవారుజామున మృతి చెందారు. గత పాలకవర్గంలో సర్పంచిగా ఐదు సంవత్సరాల పనిచేసిన ఆయనను ప్రజలు రెండో పర్యాయం కూడా ఎన్నుకున్నారు. ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలతో ప్రజల మన్ననలు పొందారు. గత కొంతకాలంగా అనారోగ్యంతో ఇబ్బంది పడుతున్నారు. విజయవాడ, హైదరాబాద్‌లలో చికిత్స పొందారు. ఆయన ఆరోగ్యం విషమించడంతో హైదరాబాద్‌లోని ఆస్పత్రి వైద్యుల సూచనలు మేరకు ఇంటికి తీసుకువచ్చారు. ఇక్కడ మృతి చెందారు. ఆయన మృతదేహాన్ని ఎంఎల్‌ఎ బొమ్మిడి నాయకర్ సందర్శించి, పూలమాలవేసి నివాళు లర్పించారు. కుటుంబ సభ్యులకు సంతాపం తెలిపారు. నాయకర్ వెంట కర్రి వీరాస్వామి, మేడిది బాబ్జి, పడవల గంగరాజు, కొల్లాటి గోపి, పెంటయ్య ఉన్నారు.

దత్తసాయి మందిరంలో అన్నసమారాధన

మొగల్తూరు: మండల కేంద్రం మొగల్తూరులోని కోట రోడ్‌లో ఉన్న దత్తసాయి మందిరంలో గురువారం అన్న సామరాధన చేశారు. యాత్రికులు బాబాను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. కానుకలు, మొక్కుబడులు చెల్లించుకున్నారు. శ్రీదత్త సాయి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన అన్న సమారాధనలో అధిక సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు. సమారాధనలో పాల్గొన్న ప్రజలకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా కమిటీ సభ్యులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

వీధి విక్రయదారులకు సహకరించాలి

తణుకు: వీధి విక్రయదారుల సంక్షేమానికి, ఉపాధి భద్రతకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సహకరించాలని ఎఐటియుసి జిల్లా అధ్యక్షులు కోనాల భీమారావు కోరారు. గురువారం తణుకు వంక సత్యనారాయణ సురాజ్యభవనంలో సంచార నాలుగు చక్రాల బండ్ల మిక్చర్, పానీపూరి వర్తక సంఘం సమావేశం జరిగింది. ఈ సందర్భంగా భీమారావు మాట్లాడుతూ ఉన్నత చదువులు చదివిన వారు సైతం ప్రభుత్వంపై ఆధారపడకుండా బండ్లపై మిక్చర్, పానీపూరి లాంటి తినుబండరాలు అమ్ముకుంటూ వీధి విక్రయదారులుగా స్వయం ఉపాధి పొందుతున్న వీరికి ప్రభుత్వాలు సబ్సిడీపై బ్యాంకు ఋణాలు ఇవ్వాలన్నారు. ట్రాఫిక్ అధికారుల వేధింపులు లేకుండా చూడాలని వారి ఉపాధి భద్రతకు సహకరించాలని భీమారావు కోరారు. కార్యక్రమంలో తణుకు శాఖ అధ్యక్షులు కిలాడి శ్రీనివాస్, కార్యదర్శి రేలంగి రాజు, ఉపాధ్యక్షులు రవి పతి, సహాయ కార్యదర్శి చింతల రామకృష్ణ, ముద్దన మురళీకృష్ణ పాల్గొన్నారు.

'ఎస్‌సి వర్గీకరణ హక్కు రాష్ట్రానికి ఇవ్వడం సరికాదు'

భీమవరం: ఎస్‌సి వర్గీకరణ చేసుకునే హక్కు రాష్ట్ర ప్రభుత్వానికి ఇవ్వడం సరైనది కాదని పివి రావు మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షులు గుమ్మాపు సూర్య వరప్రసాద్ రావు అన్నారు. భీమవరంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పొన్నమండ బాలకృష్ణ అధ్యక్షతన పివి రావు మాలమహానాడు అత్యవసర సమావేశాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా సూర్య వరప్రసాదరావు మాడుతూ ఎస్‌సి వర్గీకరణ తీర్పు విష్యంలో సుప్రీం కోర్టు తీర్పుపై భవిష్యత్‌లో ప్రజలకు న్యాయస్థానాల మీద, న్యాయమూర్తుల మీద ఉన్న గౌరవం పోతుందన్నారు. 2004లో ఇదే సుప్రీం కోర్టు ఐదుగురుతో కూడిన ధర్మాశనం ఎస్‌సి వర్గీకరణ చెల్లదు, ఎస్‌సి వర్గీకరణ చేయటానికి ఏ రాష్ట్ర ప్రభుత్వానికి అర్హత లేదని తీర్పు ఇస్తే, మళ్లీ ఇదే సుప్రీం కోర్టు ఆ తీర్పు చెల్లదని, ఎస్‌సి వర్గీకరణ చేసుకొనే హక్కు రాష్ట్ర ప్రభుత్వాలకు ఇవ్వటం సరైందిగా భావించట్లేదని తెలిపారు. ఈ సమావేశంలో దళిత నాయకులు కోరం ముసలయ్య, జిల్లా అధ్యక్షులు బండి శ్యామ్ బాబు పాల్గొన్నారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

కాసుల కోసం కక్కుర్తి..!

మున్సిపాల్టీలో అధికారుల తీరుపై విమర్శల వెల్లువ

ప్రజాశక్తి - భీమవరం టౌన్

స్థానికంగా ఉన్న వనరులను సద్వినియోగం చేసుకోవాల్సిన భీమవరం మున్సిపాలిటీ కాసుల కోసం దారి తప్పిందా..? ఇందుకు ప్రధాన కారణం గత ప్రభుత్వంలో ఒక ఉన్నత స్థాయి ప్రజాప్రతినిధిది అని ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి. గతంలో చికెన్ సెంటర్‌లో వచ్చే వ్యర్థాలను షాపుల యజమానులు ఏమి చేయాలో తెలియక పగలు వ్యాపారం చేసుకుని, రాత్రి సమయంలో వ్యర్థాలను యనమదుర్రు డ్రెయిన్‌తో పాటు పెన్నాడ, విస్సాకోడేరు కాలువతో పాటు రోడ్ల వెంబడి పడేసేవారు. దీంతో స్థానికులు వ్యర్థాలనుంచి వచ్చే దుర్వాసన భరించలేక నానా అగచాట్లు పడి మున్సిపల్ అధికారులకు కూడా ఫిర్యాదులు చేసిన సంఘటనలు ఎన్నో ఉన్నాయి. ఈ క్రమంలోనే వ్యాపారులకు మంచి అవకాశం అంది వచ్చింది. ఇటు వ్యర్థాలను కాలవగట్ల వెంబడి పడేయాల్సిన పని లేకుండానే, వాటిని అమ్మకం చేసుకుని సొమ్ములు అర్జించే అవకాశం వచ్చింది. కోళ్ల వ్యర్థాల ద్వారా ఆయిలు, ఇతర కనికలు తయారు చేసే ఫ్యాక్టరీని ఉండి మండలంలోని వాండ్రం సమీపంలో ఏర్పాటు చేశారు. దీంతో

భీమవరం మున్సిపల్ కార్యాలయం

చుట్టుపక్కల గ్రామాలకు, పట్టణాలకు చెందిన నిరుపేద యువకులు కొంతమంది ఆయా ప్రాంతాల్లో ఉన్న చికెన్ సెంటర్ల వద్ద నుంచి ఈ వ్యర్థాలను సేకరించి ఈ ఫ్యాక్టరీలో అమ్ముకునేవారు. దీంతో భీమవరం పట్టణంలో కూడా కోళ్ల వ్యర్థాలను వీళ్లు తీసుకెళ్తుండడంతో వ్యర్థాల సమస్య తగ్గింది. వీళ్లు షాపుల వరకూ కూడా నెలకు ఇంత అని ముట్ట చెప్పడంతో షాపులో యజమాని కూడా అదొక అదనపు ఆదాయంగా మిగిలింది. ఇక్కడ వరకూ బాగానే ఉన్నా అంతా సవ్యంగా జరుగుతున్నప్పటికీ ఎందుకో మున్సిపల్ కమిషనర్ కోళ్ల వ్యర్థాలపై ప్రత్యేక దృష్టిసారించారు. దీనికి తోడు ఒక రాజకీయ నాయకుడు గత ప్రభుత్వంలో ఒక వ్యక్తికి ఈ కోళ్ల వ్యర్థాలు తీసుకువెళ్లేలా కాంట్రాక్ట్ ఇవ్వాలని ఆదేశించడంతో ఇక్కడే పెద్ద ఎత్తున లావాదేవీలు జరిగినట్లు వినిపిస్తున్నాయి. దీంతో కాసులు ఎదురుగా కనిపించేటప్పటికీ అనుకున్నట్టుగా కమిషనర్ కాంట్రాక్ట్ పద్ధతిలో ఒక వ్యక్తికి ఇచ్చారు. అయితే నిబంధనల ప్రకారం ఒకచోట గొయ్యి తీసి పెట్టాలి, కానీ ఎప్పుడు ఎక్కడ పెడతారో, దానికోసం ఎక్కడ స్థలం కేటాయించారో కూడా ఎవరికీ తెలియదు. అంతా బూటకమేనని విషయం వారికి తెలుసు కాబట్టి కాంట్రాక్ట్ పేపర్‌పై పేరుకే నిబంధనలు పెట్టారని, ఆ నిబంధనలు ఎప్పుడూ పాటించలేదని అయినా కమిషనర్ ఏనాడు దృష్టి సారించలేదనే ఆరోపణలు వెలువెత్తుతున్నాయి. కాంట్రాక్టర్ మున్సిపాలిటీకి ఇప్పటి వరకూ ఒక్క రూపాయి కూడా పన్ను చెల్లించలేదని, ఈ సొమ్ములు ఎవరి దగ్గరికి వెళ్తున్నాయో, ఏమిటో అనేది ప్రశ్నగానే మిగిలిపోతుంది.

నేడు పలుచోట్ల విద్యుత్ సరఫరా నిలిపివేత

ప్రజాశక్తి - మొగల్తూరు

మండలంలోని కుమ్మరపు పాలెంలో ఉన్న విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో ఉన్న కేపీపాలెం సౌత్, కేపీపాలెం నార్త్, పేరుపాలెం సౌత్, పేరుపాలెం నార్త్ గ్రామాలలో శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకూ విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఆ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ బి.సురేష్ కుమార్ తెలిపారు. సబ్‌స్టేషన్‌లో 33 కేవీ ఏర్పాటు, మరమ్మతులు, విద్యుత్ లైనులకు అడ్డంగా ఉన్న చెట్టు కొమ్మలు తొలగించడం, తదితర కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. విద్యుత్ సరఫరా అంతరాయానికి వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

పాలకోడేరు : గొల్లకోడేరు సబ్ స్టేషన్‌లో 11 కేవీ గొల్లలకోడేరు రూరల్ ఫీడర్ చెట్ల కొమ్మలను తొలగించడానికి ఉదయం 7:30 నుంచి 12:30 వరకూ విద్యుత్ సరఫరా నిలుపుదల చేయనున్నట్లు పిర్ అహ్మద్ ఖాన్ తెలిపారు. ఈ మేరకు గురువారం ప్రకటన విడుదల చేశారు. గొల్లకోడేరు గ్రామ విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

పలుచోట్ల పింఛన్ల పంపిణీ

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

రాష్ట్రం ఐదేళ్లపాటు అన్ని రకాలుగా విచ్చిన్నమై ప్రజల జీవన విధానం దుర్భరంగా మారిన తరుణంలో రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధికి కూటమి ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తుందని తాడేపల్లిగూడెం ఎంఎల్‌ఎ బొలిశెట్టి శ్రీనివాస్ పేర్కొన్నారు. తాడేపల్లిగూడెం పట్టణంలోని గణేష్ నగర్ వద్ద పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఐదేళ్లపాటు వాలంటీర్లతో ఇంటింటికీ పింఛన్ల పంపిణీ చేస్తున్నామని రాష్ట్ర ఖజానాను వారి స్వార్థపూరితంగా వాడుకున్నారన్నారు. పట్టణంలో నాలుగు కోట్ల 20 లక్షల విలువచేసే పింఛన్లను అధికారులే స్వయంగా ఉదయం 9 గంటలకే 90 శాతంపైగా పూర్తి చేశారని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ మురళీకృష్ణ, కూటమి నాయకులు పాల్గొన్నారు.

పెనుమంట్ర : నెల మొదటి రోజునే ఇంటి వద్ద అన్నిరకాల పెన్షన్లు అందిస్తున్నది తమ ప్రభుత్వం అని మాజీ మంత్రి, ఆచంట ఎంఎల్‌ఎ పితాని సత్యనారాయణ అన్నారు. గురువారం మండలంలోని నెలమూరు, ఆలమూరు గ్రామ పంచాయతీల వేదికగా ఆయన పలువురికి పెన్షన్లు అందజేశారు. జుత్తిగ గ్రామంలో ఎన్‌టిఆర్ భరోసా పెన్షన్ కార్యక్రమంలో భాగంగా టిడిపి, జనసేన కార్యకర్తలు వీరవల్లి సత్యనారాయణ, గొలుగూరి శ్రీనివాస్ రెడ్డి, ఎన్‌విఆర్ నర్సారెడ్డి, కొవ్వూరు సోం భాస్కర్ రెడ్డి, జనసేన వీరవల్లి ఇందరయ్య, వీరవల్లి రాంబాబు పాల్గొన్నారు.

గణపవరం: ప్రభుత్వం గ్రామాల్లో వృద్ధులకు, వికలాంగులకు, కళాకారులకు ఇస్తున్న పెన్షన్‌లు గురువారం 94 శాతం అందజేసినట్లు గణపవరం ఇన్‌ఛార్జి ఎంపిడిఒ కె.సూర్యనారాయణ తెలిపారు. మండలంలో 8,821 మంది పెన్షన్‌దారులు ఉండగా 8,173 మందికి పెన్షన్ అందజేసినట్లు తెలిపారు. రూ.3 కోట్ల 76 లక్షల 18,500 రూపాయలను సచివాలయం సిబ్బందితో పంపిణీ చేశామన్నారు. గ్రామాల్లో ఎవరైనా లేకపోతే రెండో తేదీ ఉదయం అందజేస్తామని తెలిపారు.

ఉండి: వాలంటరీ వ్యవస్థ లేనంత మాత్రాన రెండు నెలల నుంచి వృద్ధులకు, వికలాంగులకు, వితంతువులకు దీర్ఘకాలిక రోగులకు ఇచ్చే ఎన్‌టిఆర్ భరోసా పెన్షన్ పథకం నిలిచిపోలేదని ఉండి ఎంఎల్‌ఎ కనుమూరి రఘురామకృష్ణంరాజు అన్నారు. గురువారం సాయంత్రం ఉండి మండలం చిలుకూరు గ్రామంలో నిర్వహించిన ఎన్‌టిఆర్ భరోసా పెన్షన్ పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న కనుమూరి రఘురామకృష్ణంరాజు మాట్లాడుతూ వాలంటరీ వ్యవస్థ వైసిపి ప్రయోజనాల కోసమే పని చేసిందని, ఎన్నికల సమయంలో రాజీనామా చేసిన వారిలో కొంతమందిని బలవంతంగా రాజీనామా చేయించారని, మరి కొంతమంది స్వచ్ఛందంగా రాజీనామా చేశారన్నారు. మిగిలిన వారి కోసం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నిర్ణయం తీసుకుంటారని వాలంటరీ వ్యవస్థ లేనంత మాత్రాన పెన్షన్ పంపిణీ నిలిచిపోలేదని, ఇచ్చిన మాట ప్రకారం తగిన సమయంలోనే సచివాలయ సిబ్బంది ద్వారా పెన్షన్ పంపిణీ చేయించామన్నారు. నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు ఎంఎల్‌ఎలు, నాయకులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారని ఆయన అన్నారు. ఎలక్షన్ కోడ్ సమయంలో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి టిడిపిపై బురదజల్లే ప్రయత్నం చేశాడని, సచివాలయ సిబ్బందితో పెన్షన్ పంపిణీ చేయించాలని కోరినప్పటికీ, వాలంటరీ వ్యవస్థపై ఎలక్షన్ కమిషన్‌కు టిడిపి ఫిర్యాదు చేయడం వల్లనే వృద్ధులు ఇబ్బందులు పడుతున్నారని, వైఎస్ జగన్ తమ పత్రికల్లోనూ, ఛానల్లోనూ విస్తృత ప్రచారం చేశాడన్నారు.

తణుకు: పేదల కోసం పరితపిస్తున్న వ్యక్తి ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అని, మాటకు కట్టుబడి పెంచిన పెన్షన్లను అందజేస్తున్న ఘనత చంద్రబాబునాయుడుదేనని తణుక నియోజకవర్గ ఎంఎల్‌ఎ ఆరిమిల్లి రాధాకృష్ణ అన్నారు. తణుకు నియోజకవర్గంలో ఎన్‌టిఆర్ పెన్షన్ పంపిణీ కార్యక్రమంలో తణుకు నియోజకవర్గంలో వరిఘేడు, ఎర్రనీలిగుంట, తణుకు పట్టణం, ఇరగవరం గ్రామాల్లో ఎంఎల్‌ఎ ఆరిమిల్లి రాధాకృష్ణ, ముఖ్యఅతిథిగా జిల్లా టిడిపి అధ్యక్షులు ఉండి నియోజకవర్గ మాజీ ఎంఎల్‌ఎ మంతెన రామ రాజు లబ్ది దారుల ఇంటికి వెళ్లి పెన్షన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రాధాకృష్ణ మాట్లాడుతూ 96 శాతంపైగా లబ్ధిదారులకు మొదటి రోజులోనే పెన్షన్లు పంపిణీ చేశామన్నారు. గతంలో మాట తప్పను అని ప్రగల్భాలు పలికిన వైఎస్ జగన్మోహన్‌రెడ్డి వెయ్యి రూపాయలు పెంచడానికి ఐదేళ్ల సమయం తీసుకున్నారని విమర్శించారు. ప్రజల మధ్య పండగ వాతావరణంలో పెన్షన్లు పంపిణీ నిర్వహిస్తున్నామని, లబ్ధిదారుల కళ్లల్లో ఆనందం ప్రస్ఫుటంగా కనబడుతోందన్నారు. ఎన్‌టిఆర్ భరోసా చరిత్రలో నిలవబోతుందని తెలిపారు. వికలాంగులు, వితంతువులు, వృద్ధులకు ప్రభుత్వం మనోధైర్య కల్పిస్తోందన్నారు. 55 రోజుల్లో రెండోవ సారి పెన్షన్ పంపిణీతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారన్నారు. చంద్రబాబునాయుడు వస్తేనే రాష్ట్రంలో పరిపాలన బాగుంటుందని ప్రజలు గ్రహించారన్నారు. వందకు వంద శాతం సూపర్ సిక్స్ పథకాలను అమలు చేస్తామని స్పష్టం చేశారు. సంక్షేమం, అభివృద్ధే కూటమి ప్రభుత్వ లక్ష్యమని రాధాకృష్ణ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి, జనసేన, బిజెపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కాళ్లలో పింఛన్ పంపిణీ చేస్తున్న ఎంఎల్‌ఎ రఘురామ

కాళ్ల: పేదలకు ఇచ్చిన మాట ప్రకారం పింఛన్ సొమ్ము ఒకేసారి పెంచి అందిస్తున్న ఘనత కూటమి ప్రభుత్వానికే దక్కిందని ఉండి ఎంఎల్‌ఎ కనుమూరు రఘురామకృష్ణంరాజు పేర్కొన్నారు. గురువారం మండలంలోని జక్కరం, కోపల్లె గ్రామాల్లో ఎన్‌టిఆర్ పెన్షన్ భరోసా పథకం ద్వారా నిరుపేద లబ్ధిదారులకు ఎంఎల్‌ఎ రఘురామకృష్ణంరాజు స్థానిక నాయకులు సాగిరాజు అప్పలరాజు, మంతెన కోదండ రామరాజులతో కలిసి పంపిణీ చేశారు. మండల పరిధిలో గల 21 గ్రామాలకు సంబంధించి 8,938 భరోసా పింఛన్ లబ్ధిదారులకు రూ.4,75,59,500లు పంపిణీ చేసినట్లు ఎంఎల్‌ఎ వెల్లడించారు.

మొగల్తూరు : మండలంలోని గ్రామాల్లో ఎన్‌టిఆర్ భరోసా పింఛన్లు లబ్ధిదారులకు గురువారం 98 శాతం నగదు పంపిణీ చేసామని ఎంపిడిఒ ఉండ్రు బాబ్జి రాజు తెలిపారు. 10,733 మంది లబ్ధిదారులకు గాను 98 శాతం మందికి లబ్ధిదారులకు పెన్షన్లు అందజేశామని తెలిపారు. మిగతా రెండు శాతం మందికి శుక్రవారం పూర్తి చేస్తామమని తెలిపారు.


బాధ్యతలు స్వీకరిస్తున్న వేంకటేశ్వరరావు

మండల విద్యాశాఖాధికారి-2గా వెంకటేశ్వరరావు

ప్రజాశక్తి - కాళ్ల

భీమవరం మండల విద్యా శాఖాధికారి-2గా ఉన్న వేండ్ర వెంకటేశ్వర రావు కాళ్ల మండలం విద్యాశాఖాధికారి-2గా కాళ్ల మండల విద్యా శాఖాధికారి కార్యాలయంలో అదనపు బాధ్యతలు గురువారం స్వీకరించారు. జులై 31న గాదిరాజు కనకరాజు ఉద్యోగ విరమణ చేశారు. ఆయన స్థానంలో భీమవరం మండల విద్యాశాఖ అధికారి-2గా పనిచేయుచున్న వేండ్ర వెంకటేశ్వరరావుగా పూర్తి అదనపు బాధ్యతలు అప్పగిస్తూ ఉత్తర్వులు జారీ కావడంతో మండల విద్యాశాఖ అధికారి-2 కాళ్ల మండల విద్యాశాఖ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో కార్యాలయ సిబ్బంది, మండలంలోని వివిధ ఉపాధ్యాయ సంఘ నాయకులు పాల్గొన్నారు. యుటిఎఫ్ నుంచి స్వామి, శంకర్, కిషోర్, ఎస్‌టియు నుంచి సాయివర్మ, పాపారావు, గణేష్ పిఆర్‌టియు నుంచి మురళీ, కృష్ణమూర్తి, కలికిమూర్తి, ఉపాధ్యాయులు వెంకటేశ్వరరావు, వెంకట్రావు, సిఆర్‌ఎంటిలు వెంకన్న బాబు, అప్పారావు, బాలాజీ, ప్రకాష్, పుష్పరాజ్, రోహిణి, మోహన్, శివారెడ్డి పాల్గొన్నారు.

సెప్టిక్ ట్యాంక్ వాహనం ప్రారంభం

ప్రజాశక్తి - నరసాపురం

నరసాపురం పట్టణంలోని పురపాలక కార్యాలయంలో గురువారం నూతన సెప్టిక్ ట్యాంక్ వాహనాన్ని జెండా ఊపి నరసాపురం ఎంఎల్‌ఎ బొమ్మిడి నాయకర్ ప్రారంభించారు. అనంతరం మున్సిపాలిటీ పరిధిలోకి పారిశుధ్య కార్మికులకు ఎంఎల్‌ఎ చేతుల మీదగా రైన్ కోట్స్ పంపిణీ చేశారు. అనంతరం పారిశుధ్య కార్మికులతో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్మన్ బర్రె వెంకట రమణ, కొత్తపల్లి నాని, కమిషనర్ కె.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

పలుచోట్ల ముర్రిపాలపై అవగాహన

ప్రజాశక్తి - గణపవరం

పుట్టిన బిడ్డకు ముర్రిపాలు శ్రేష్ఠదాయకమని గణపవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు పి.కిరణ్మయి, పి.సంతోష్ అన్నారు. తల్లిపాల వారోత్సవాల సందర్భంగా స్థానిక పిహెచ్‌సిలో వారోత్సవాల్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్లు మాట్లాడుతూ బిడ్డ పుట్టిన గంటలోపు బిడ్డకు తల్లిపాలు ఇవ్వడం వల్ల పిల్లలకు వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుందని, ముర్రిపాలు ఇవ్వడం వల్ల పిల్లలకు వ్యాధులు రాకుండా కాపాడుకోవచ్చునని తెలిపారు. తల్లి, పిల్లల సంరక్షణ కోసం ఐసిడిఎస్ ఆధ్వర్యంలో వారం రోజులపాటు గ్రామాల్లో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించి తల్లులకు ముర్రిపాలపై అవగాహన కల్పిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్వైజర్ తులసి, హెచ్‌విసిహెచ్.పద్మజ, ఎఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉండి: తల్లిపాలు బిడ్డకు అమృతంతో సమానమని ఐసిడిఎస్ సిడిపిఒ వాణి విజయరత్నం, ఉండి పిహెచ్‌సి వైద్యులు డాక్టర్ పి.సునంద అన్నారు. గురువారం ఉండి మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో నిర్వహించిన తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా వాణి విజయ రత్నం, డాక్టర్ పి.సునంద పాల్గొని మాట్లాడుతూ తల్లిపాలల్లో బిడ్డకు అవసరమైన పోషక పదార్థాలు, ప్రోటీన్లు కలిగి ఉంటాయని, దీనివల్ల బిడ్డ ఆరోగ్యంగా ఉండటమే కాకుండా ఇన్ఫెక్షన్ల బారిన పడకుండా ఉంటాడని వారు సూచించారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ ఉండి సెక్టర్ సూపర్వైజర్, పి.మేరీ, కొలమూరు సెక్టర్ సూపర్వైజర్ నాగలక్ష్మి, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆకివీడు : అప్పుడే పుట్టిన బిడ్డకు తప్పనిసరిగా తల్లిపాలు, ముర్రిపాలు ఇవ్వాలని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ రమేష్ వివరించారు. తల్లిపాల వారోత్సవాల కార్యక్రమం మొదటి రోజు గురువారం మండలంలోని చినకాపవరం సబ్ సెంటర్‌లో

మొగల్తూరులో పౌష్టికాహారం అందజేస్తున్న ఎంఎల్‌ఎ

స్థానికులు వైద్య ఆరోగ్య సిబ్బందితో సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా ఆయన తల్లిపాల ప్రాముఖ్యతను వివరించారు. కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ కె.ప్రసాద్, హెచ్‌వి.రాజమణి, ఎంఎల్‌హెచ్‌పి డి.నాగవాణి, ఎఎన్‌ఎం సౌశీల్య, ఆశా వర్కర్లు, అల్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

మొగల్తూరు : చిన్నారులకు తల్లిపాలు పట్టడంతో వ్యాధి నిరోధక శక్తి పెంపొందుతుందని ఎంఎల్‌ఎ బొమ్మిడి నాయకర్ అన్నారు. మొగల్తూరులోని ఐసిడిఎస్ కార్యాలయంలో సిడిపిఒ బి.ఊర్మిల అధ్యక్షతన తల్లిపాల వారోత్సవాల కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పిల్లలకు తల్లిపాల ఆవశ్యకత తెలిసేలా చైతన్య పరచాలని ఆయన సూచించారు. అనంతరం గర్భిణులకు శ్రీమంతం కార్యక్రమం నిర్వహించి పౌష్టికాహారాన్ని అందించారు. చిన్నారులకు అన్నప్రాసరణ చేశారు. అనంతరం బాల్యవివాహాల నిర్మూలనపై అవగాహన కల్పిస్తూ వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. గ్రామంలో ప్రదర్శన చేశారు. ఆయా కార్యక్రమాల్లో టిడిపి నరసాపురం నియోజకవర్గ ఇన్‌ఛార్జి పొత్తూరి రామరాజు, వైస్ ఎంపిపి కైలా సుబ్బారావు , టిడిపి, జనసేన మండల అధ్యక్షులు గుబ్బల నాగరాజు, కొల్లాటి గోపి, నాయకులు మామిడిశెట్టి సత్యనారాయణ, కత్తిమండ ముత్యాలరావు, పాల రాంబాబు ఉన్నారు.

యలమంచిలి: అప్పుడే పుట్టిన శిశువులకు తల్లిపాలు ఎంతో శ్రేయస్కరమని ఐసిడిఎస్ సూపర్వైజర్ ఎండి హసీనా అన్నారు. గురువారం మండలంలోని చించినాడ, యలమంచిలి, శిరగాలపల్లి, అబ్బి రాజు పాలెం, బూరుగుపల్లి, గుంపర్రు వంటి పలు గ్రామాల్లో మిషన్ శక్తి, తల్లిపాల వారోత్సవాలు, భేటీ బచావో బేటి పడావో వంటి కార్యక్రమాలు నిర్వహించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్స్ రజని, చిన్ని తల్లి, ఎంవికె.భవాని పాల్గొన్నారు.

రంగనాయకులకు పలువురు పరామర్శ

యలమంచిలి: ఇటీవల సతీవియోగం పొందిన మండలంలోని కట్టుపాలెం గ్రామానికి చెందిన సిపిఎం నాయకుడు అంబటి రంగనాయకులకు గురువారం పలువురు పరామర్శించారు. పరామర్శించిన వారిలో ఆచంట మాజీ ఎంఎల్‌ఎ దిగుపాటి రాజగోపాల్, సిపిఎం పాలకొల్లు, యలమంచిలి మండలాల కార్యదర్శులు జవ్వాది శ్రీనివాస్, కానేటి బాలరాజు, సిపిఎం జిల్లా నాయకుడు బాతిరెడ్డి జార్జి తదితరులున్నారు.

నూతన ఐఎఎస్ సుందర్ రాజుకు ఘన స్వాగతం

భీమవరం టౌన్: శాసనమండలి ఛైర్మన్ కొయ్యే మోషన్ రాజు తనయుడు సుందర్ రాజు ఢిల్లీలో ఐఎఎస్‌గా పట్టా పొంది గురువారం ఆయన తండ్రి మోషన్ రాజుతో కలసి భీమవరం నివాసానికి రావడంతో పట్టణ ప్రజలు, టిడిపి, వైసిపి, జనసేన నాయకులు ఘన స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో డిసిసిబి మాజీ ఛైర్మన్ వేండ్ర వెంకటస్వామి, వైసిపి నాయకులు పాల్గొన్నారు.

మహిళలకు పండ్లు పంపిణీ

పాలకొల్లు : స్థానిక క్షీరా రామలింగేశ్వర స్వామి వారి ఆలయంలో కోటి లింగార్చనికి కోటిలింగాలు తయారు చేస్తున్న మహిళలకు పాలకొల్లు యునైటెడ్ కాపు ఇంటర్నేషనల్ సర్వీస్ క్లబ్ వారు గురువారం పండ్లను పంపిణీ చేశారు. క్లబ్ అధ్యక్షులు జక్కంపూడి మదన్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఇంటర్ నేషనల్ డైరెక్టర్ డాక్టర్ ముచ్చర్ల సంజయ్ పాల్గొన్నారు.

టెండరు నోటీసు

ఆర్.ఓ.సి. నెం. 1684/14/2024/ఇ1 తేది.31-07-2024

తణుకు పురపాలక సంఘ పరిధిలో ఈ దిగువ తెల్పిన పనులకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ ద్వారా టెండర్లు పిలువబడుచున్నవి.

		ఇ.సి.వి. (రూ. లక్షలలో)
1. డ్రయిను పనులు	3 నెం.లు	12.36
2. ఎలక్ట్రికల్ పనులు	1 నెం.	12.16
3. వాటర్ సప్లయి పనులు	2 నెం.లు	7.31
4. ఇతరములు	1 నెం.	8.46

సంబంధిత వివరములకు www.apeprocurement.gov.in వెబ్ సైటు నందు ది. 01-08-2024వ తేదీ నుండి చూడవచ్చును.

సం/- కమిషనరు
తణుకు పురపాలక సంఘం

మహారాజశ్రీ కొవ్వూరు ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టు
O.S. No. 66/2005

Between:
శ్రీ కొవ్వూరి వీర్రెడ్డి -వాది
AND
శ్రీమతి మంద్రు సరోజినీ వగైరాలు -ప్రతివాదులు

To:
10) మంద్రు అపర్ణ, తండ్రి: (లేటు) మంద్రు ఆహోరన్ (Mandru Ahoran), వయస్సు 31 సంIIలు, స్త్రీ, C/o. మంద్రు మంగమ్మ, జి.పంగిడిగూడెం, జంగారెడ్డిగూడెం, ఏలూరు జిల్లా.
11) మంద్రు ప్రవల్లిక, తండ్రి: (లేటు) మంద్రు ఆహోరన్ (Mandru Ahoran), వయస్సు 31 సంIIలు, స్త్రీ, C/o. మంద్రు మంగమ్మ, జి.పంగిడిగూడెం, జంగారెడ్డిగూడెం, ఏలూరు జిల్లా.
-10, 11 ప్రతివాదులు

పై నెంబరు దావాలో 10, 11 ప్రతివాదులు అయిన మీకు కోర్టు ద్వారా ఎన్నిసార్లు సమన్లు/నోటీసులు పంపినా మీరు వాటిని తీసుకోకుండా ఉద్దేశ్యపూర్వకంగా త్రిప్పి వేయుచున్నారు. కావున **ది. 12-8-2024 సంIIరం తేదీ ఉదయం 10.30 నిIIలకు** మీరు స్వయంగా గాని, లేదా ప్లీడరు ద్వారా గాని పై కోర్టు వారి ఎదుట హాజరు అయ్యి సదరు పై దావాలో మీ ఆక్షేపణలను తెలుపుకొనవలెను. లేనియెడల సదరు దావాను మీకు పరోక్షముగా శ్రీ కోర్టు వారు తీర్మానించెదరు.
(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)

కొవ్వూరు 01-8-2024
దుగ్గిరాల తాతారావు
అడ్వకేట్, కొవ్వూరు

మహారాజశ్రీ కొవ్వూరు ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టు
I.A. No. 612/2022
O.S. No. 8/2007

Between:
1. శ్రీ కొడవటి చిన సత్యనారాయణ (డైడ్)
2. శ్రీ కొడవటి వెంకట రత్నమ్మ & వగైరా
-పిటీషనర్లు/ వాదులు
మరియు
1. శ్రీ గంటా శ్రీ హరినాధరావు & వగైరా
-రెస్పాండెంట్లు/ ప్రతివాద్లు

టు:
12) వెత్సా లిఖిత, D/o. లేటు గణపతిరావు, నివాసం: కొయ్యలగూడెం గ్రామం, కొయ్యలగూడెం మండలం, పశ్చిమ గోదావరి జిల్లా, ప్రస్తుతం ఏలూరు జిల్లా.
13) వెత్సా మాధురి, D/o. లేటు గణపతిరావు, నివాసం: కొయ్యలగూడెం గ్రామం, కొయ్యల గూడెం మండలం, పశ్చిమగోదావరి జిల్లా, ప్రస్తుతం ఏలూరు జిల్లా.
-12, 13 రెస్పాండెంట్లు

పై నెంబరు పిటిషన్‌లో 12, 13 రెస్పాండెంట్లు/ప్రతివాదులు అయిన మీకు కోర్టు ద్వారా ఎన్నిసార్లు సమన్లు/ నోటీసులు పంపినా మీరు వాటిని తీసుకోకుండా ఉద్దేశ్యపూర్వకంగా త్రిప్పి వేయుచున్నారు. కావున **ది. 09-8-2024 సంIIరం తేదీ ఉదయం 10.30 నిIIలకు** మీరు స్వయంగా గాని, లేదా ప్లీడరు ద్వారా గాని పై కోర్టు వారి ఎదుట హాజరు అయ్యి సదరు పై పిటిషన్‌లో మీ ఆక్షేపణలను తెలుపుకొనవలెను. లేనియెడల సదరు పిటిషన్‌ను మీకు పరోక్షముగా శ్రీ కోర్టు వారు తీర్మానించెదరు.
(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)

కొవ్వూరు 01-8-2024
దుగ్గిరాల తాతారావు
అడ్వకేట్, కొవ్వూరు

పాస్‌పోర్ట్ పోయినది

పశ్చిమగోదావరి జిల్లా, తణుకు మండలం మండపాక శివారు, యర్రనీళ్లగుంట గ్రామానికి చెందిన కడలి మహేష్ పాస్‌పోర్ట్ నెం. **Y5208417** ను తీసుకొని జిరాక్స్ నిమిత్తం తణుకు టౌన్‌కు వస్తుండగా మార్గ మధ్యలో పడిపోయినది. దొరికిన వారు క్రింది అడ్రస్‌కు అందజేయగలరు.

అడ్రస్: కడలి మహేష్
S/o. శ్రీను, డోర్ నెంబర్: 8-59/1
యర్రనీళ్లగుంట, మండపాక రూరల్
తణుకు మండలం, పశ్చిమగోదావరి జిల్లా
పిన్-534225
ఫోన్ నెం..9640290188

NOTICE
IN THE COURT OF THE ADDL.CIVIL JUDGE(SENIOR DIVISION):: NARASARAOPET
I.P. No. 22/2022

Between:
Naidu Bhadraiah…..Petitioner
And
Devendrappa & others .... Respondents
To,
R-9: Bachini Subbayamma, W/o.Subba Rao, Rio. D.No.4-73, Pothavaram Village and Nallajerla Mandal, West Godavari Dt.,

పైనెంబరు IP లోని పిటీషనరు తనను ఇన్ సాల్వెంటుగా డిక్లేర్ చేయమని కోరుచు పిటీషన్ దాఖలు చేసిన పిటీషనులో 9వ రెస్పాండెంటు అయిన మీకు నోటీసు నిమిత్తం ది.29-08-2024 వాయిదా వేసినారు. కావున ఆరోజున ఉ.గం. 10-30 ని.లకు పైకోర్టు వారి ఎదుట మీరు స్వయంగాగాని, మీతరపు వకీలు గారి ద్వారాగాని హాజరై మీకుగల అక్షేపణలు తెలుపుకొనగలరు. లేనిచో కోర్టువారిచే మీపరోక్షమున విచారించి తీర్మానించబడును.
(శ్రీ కోర్టువారి ఉత్తర్వుల మేరకు)
వాయిదా తేది: 29-08-2024

L. Sri Harsha,
B. Siva Rama Krishna Reddy,
M. Harish Kumar,
K. Pratap Kumar
Advocates for Petitioner,
D.No. 9-3-10, Railpet, Guntur.
Cell.9885839333.